# పేదలకు రేషన్ కార్డులను సైతం దూరంచేస్తున్న ప్రభుత్వం

**పేదల** మౌలిక సమస్యలను పరిష్కరించకుండా, అందుకు వారు ఉద్యమించకుండా, సంక్షేమ పథకాల భ్రమలలో పాలకులు వారిని ముంచెత్తుతున్నారు. సంక్షేమ పథకాల పేరుతో కొందరు రాజకీయ పైరవీకారులను సృష్టించుకొని వారిద్వారా పేదలను తమ చుట్టూ త్రిప్పు కొంటున్నారు. పేదలను వంచనకు గురిచేసే ఈ పథకాలను కూడా పాలకులు సక్రమంగా అమలు జరపటంలేదు. వారి చుట్టూ తిరిగే పైరవీకారులకే అవి ఎక్కువగా అందుతున్నాయి. ఏ మేరకైనా పేదలకు ప్రయోజనం చేకూర్చే పథకాలను వ్యూహాత్మకంగా నీరు గారుస్తున్నారు. రేషన్‌కార్డుల పథకమే అందుకు నిదర్శనం.

దారిద్ర్యరేఖకు దిగువున వున్న పేదలకు చౌక డిపోలద్వారా 1 రూపాయికే కిలో బియ్యంతోపాటు, కిరోసిన్, పప్పులు, పంచదార అందిస్తానని అందుకోసం వారికి తెల్లరేషన్ కార్డులు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పుడల్లా ఈ పథకం అమలులో గందరగోళం ఏర్పడుతున్నది. 2014 ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అధికస్థానాలు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రూపాయికే కిలో బియ్యం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఒక పథకాన్ని ప్రవేశపెట్టి దాన్ని ఆచరణలో గణనీయంగా తగ్గించటంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకి మంచి అనుభవం వుంది. కిలో బియ్యం రూపాయికే ఇస్తానని చెప్పిన చంద్రబాబు, గత ప్రభుత్వ పాలనలో రేషన్‌కార్డుల జారీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, వాటిని నివారించేందుకు కార్డుల పరిశీలన ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అనర్హుల తెల్లకార్డులను రద్దుచేయటం ఎవరూ కాదనరు. కార్డుల పరిశీలన అంతా గ్రామ తెలుగుదేశం నాయకుల అజమాయిషీలో జరిగింది. తమకు ఇష్టంలేని వారి పేర్లు తొలగించేలా చేశారు. అందులో పేదలే అధికంగా వున్నారు. దీన్ని గమనిస్తే కార్డుల తనిఖీ ప్రక్రియ రాజకీయ కోణంలో జరిగిందనేది అర్థమౌతుంది. ఈ సందర్భంగా లక్షలాది కార్డులు తొలగించారు. రేషన్ ఇచ్చే విధానంలోనూ చంద్రబాబు మార్పులు చేశారు. కూపన్ల వలన రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడు తున్నారని, దాన్ని నివారించేందుకు ఈ-పాస్ విధానాన్ని ప్రవేశపెట్టాడు. దీనిని ఆధార్‌కి అనుసంధానం చేశారు. ప్రతినెల లబ్ధిదారులు మిషన్‌పై వేలిముద్రవేసి దాని నుండి ఆమోదం పొందితేనే రేషన్ ఇస్తారు. వేలిముద్ర సరిగా పడకపోయినా, లబ్ధిదారునికి ఆధార్‌కార్డు లేకపోయినా ఈ-పాస్ మిషన్ రేషన్‌కి ఆమోదం లేదని చెబుతుంది. ఫలితంగా డీలర్ రేషన్ ఇవ్వడు. ఇదే కాకుండా వరుసగా మూడుసార్లు రేషన్ తీసుకోకపోతే ఆ లబ్ధిదారుని కార్డుని రద్దుచేస్తున్నారు. చాలామంది గ్రామీణ పేదలు వున్నచోట ఉపాధి దొరక్క పట్టణాలకు, ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారు. నెలల తరబడి అక్కడే వుండడంవలన రేషన్ తీసుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితిని గమనించకుండా వారి రేషన్ కార్డులు రద్దుచేస్తున్నారు. ఇలాంటి విధానం ఎడల గత 5 నెలల కాలంలో 9 లక్షల 14వేల కార్డులను రాష్ట్రప్రభుత్వం తొలగించింది. ఇంకా తెల్లకార్డుల లబ్ధిదారులను తొలగించేందుకు అనేక మార్గాలు అన్వేషిస్తున్నది. రెండు చక్రాల మోటారు బండి, ఫ్రిజ్ వున్నవారి తెల్లకార్డులను తొలగించాలని, అధికారులకు ఆదేశాలు యిచ్చింది. ఇది అమల్లోకి వస్తే కార్డుల సంఖ్య పెద్ద మొత్తంలో తగ్గుతుంది. చాలామంది పేదలకు బ్రతుకుదెరువుకోసం చేసే చిరువ్యాపారాలకు మోటారుబిల్లు ఉపయోగిస్తున్నారు. వీరి కార్డులన్నీ రద్దుఅయ్యే ప్రమాదం వుంది.

వివిధ కారణాలతో తెల్లకార్డుల లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించి, ఆర్థికభారం లేకుండా చేసుకోవటమే చంద్రబాబు ప్రభుత్వ విధానం. అందులో భాగమే కార్డుల తగ్గింపు.

ooooo